

# సూర్య


www.suryaa.com

19వ వసంతంలోకి ...


కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
పోలవరం(రంపచోడవరం)జిల్లా

సోమవారం,26 జనవరి 2026 | 8 పేజీలు


## లాభాల వేటలో 'పరిశ్రమల' బరితెగింపు







సముద్రంలోకి విషం



### ప్రజల ప్రాణాలు తీస్తున్న 'దొంగ' నివేదికలు !

- 'మామూళ్ల' మత్తు వదిలి...పిసిబి నిఘా పెట్టాలి..
- విషపు గాలులతో విలవిల్లాడుతున్న చిన్నారులు, అన్నదాతలు !
- పరిశ్రమల అరాచకంపై ఇంచార్జ్ కలెక్టర్ ఉక్కుపాదం మోపాలి..!

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని పరిశ్రమలు చట్ట ప్రకారం ప్రతి సంవత్సరం రెండుసార్లు పర్యావరణ నివేదికలను కాలుష్యనియంత్రణ మండలికి సమర్పించాల్సి ఉంది. ఇందులో మొదటిది కంపెనీ స్వయంగా ఇచ్చే నివేదిక కాగా, రెండోది ఖచ్చితంగా కేంద్రం అనుమతించిన థర్డ్ పార్టీ ఆడిట్ నివేదిక అయి ఉండాలి. కానీ, నేడు మెజారిటీ పరిశ్రమలు ఈ నిబంధనలను బేఖాతరు చేస్తూ నివేదికలను తుంగలో తొక్కుతున్నాయి.పరిశ్రమల నుండి విపరీతంగా కాలుష్యం బయటకు వదులుతున్నందునే, నిజాలు ఎక్కడ బయట పడతాయో అన్న భయంతోనే యాజమాన్యాలు ఈ నివేదికలు ఇవ్వడంలేదని పర్యావరణ వేత్తలు మండి పడుతున్నారు. ప్రజాసమాజం పట్ల కనీస గౌరవం, ప్రజల ప్రాణాల మీద భయంలేకుండా కేవలం లాభాల కోసమే తెగిస్తున్న ఇటువంటి అరాచకాలను అడ్డుకోవాల్సిన పిసిబి అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి, నివేదికలు ఇవ్వని పరిశ్రమలకు వెంటనే నోటీసులు జారీచేసి, నిబంధనలు అమలు చేసేలా కఠినంగా పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొన్ని విషతుల్య పరిశ్రమల అరాచకంపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో అందించిన క్షేత్ర స్థాయిలో పరిశీలనాత్మక కథనం...

ఉమ్మడిగోదావరి జిల్లాల సూర్యబ్యూరో :

- మిగతా 2 లో..

రత్నగిరిపై

## రథసప్తమి సంబరం

- కళామందిరంలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



**అన్నవరం,మేజర్‌న్యూస్ :** సూర్య భగవానుడి జన్మదినమైన రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని అన్నవరం సత్యదేవుని క్షేత్రం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది.రత్నగిరి కొండపై వెలసిన కళామందిరం వద్ద దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. దేవస్థానం కార్యనిర్వహణాధికారి, ఆర్జెడీ వేంద్ర త్రినాధరావు పర్యవేక్షణలో ఈవేడుకలు అత్యంత వైభవంగా ఆదివారం జరిగాయి.

**కళా ప్రదర్శనలతో అలరించిన కళాకారులు..**ప్రభాత వేళ నుండే కళామందిరం ఆధ్యాత్మిక వేదికగా మారింది. కళాకారులు ప్రదర్శించిన క్లాసికల్ డ్యాన్స్, ముఖ్యంగా 'సూర్యాష్టకం' నృత్యరూపకం భక్తుల కరతాళ ధ్వనుల మధ్యసాగింది. సూర్య గమనాన్ని, ప్రకృతిలో

- తరువాయి 2లో..

మద్యం మాఫియా డాన్ 'జోగి'కి

## జైలు శిక్ష తప్పదు!

దోచుకో..దాచుకో..ఇదే వైసీపీ నైజం

మంత్రి వాసంశెట్టి సుభాష్ నిప్పులు

-కులం కార్డు ఇప్పుడే గుర్తొచ్చిందా?
-మాజీ మంత్రిపై ధ్వజమెత్తిన కార్మిక శాఖ మంత్రి



**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**
వైసీపీ హయాంలో అక్రమ మద్యం సామ్రాజ్యాన్ని ఏలిన మాజీ మంత్రి జోగి రమేష్‌పై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆదివారం రామచంద్రపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంపై కుట్రలు పన్నాలని చూస్తే కాలం ఎవరినీ వదలదని హెచ్చరించారు.

**జైలుకు పంపింది చట్టం.. చంద్రబాబు కాదు!**
"జోగి రమేష్‌కు జోకులు ఎక్కువయ్యాయి" అని ఎద్దేవా చేస్తూ, ఆయన్ను జైలుకు పంపింది సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కాదని, ఆయన చేసిన అక్రమాలే ఆయన్ని జైలు గడప తొక్కించాయని స్పష్టం చేశారు. అక్రమ మద్యం తయారు చేసి ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని చూసిన కుట్ర తిరిగి ఆయనకే చుట్టుకుందని సుభాష్ విమర్శించారు. జైలుకు వెళ్లిన వ్యక్తి ఫైవ్ స్టార్ హోటల్‌కు వెళ్ళినట్టుగా దోమలు, నిద్ర గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు.

**వైసీపీ అంటేనే 'స్కాంల పుట్ట'.. గత ఐదేళ్ల వైసీపీ పాలనపై మంత్రి సుభాష్ విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు:**
**లిక్కర్ మాఫియా:** వైసీపీ హయాంలో అమలైంది

- తరువాయి 2లో..

# లాభాల వేటలో ‘పరిశ్రమల’ బరితెగింపు

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** పరిశ్రమలు అభివృద్ధికి పట్టుకొమ్మలే కావొచ్చు.. కానీ అవే పరిశ్రమలు మానవ సమాజానికి ఉరితాడుగా మారుతుంటే చూస్తూ ఊరుకోవాలా? మహాకవి శ్రీశ్రీ చెప్పినట్లుగా, ఇతరుల ప్రాణాలను పీడించి సంపాదించే భాగ్యం ఎవరికీ గర్వకారణం కాదు. “మానవ సమాజం లేని పరిశ్రమలు ఉన్నా ఒకటే, లేకున్నా ఒకటే” అనే కనీస స్పృహ అటు యాజమాన్యాలకు, ఇటు పర్యవేక్షించాల్సిన బాధ్యతాయుతమైన అధికారులకు ఉండాలి.

**నివేదికలు ఇవ్వడం చట్టపరమైన బాధ్యత: ఏమిటా నిబంధన?**

పర్యావరణ పరిరక్షణ చట్టం నిబంధనల ప్రకారం, పరిశ్రమలు తమ పర్యావరణ అనుమతి (ఈసీ), స్థాపన సమ్మతి (సిటీఈ)మరియు నిర్వహణ సమ్మతి (సిపిఓ) షరతులను ఎలా అమలు చేస్తున్నాయో వివరిస్తూ ఏడాదికి రెండుసార్లు నివేదికలు సమర్పించాలి.

**– గడువు తేదీలు:**

ఈ నివేదికలను ప్రతి సంవత్సరం జనవరి 1వ తేదీ మరియు జూలై 1వ తేదీ నాటికి ఖచ్చితంగా ఏపీ ఏపీపీసీబీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి.

– ఆడిటింగ్ నిబంధన: మొదటి నివేదికను పరిశ్రమ స్వయంగా ఇవ్వవచ్చు. కానీ, రెండవ అర్ధ వార్షిక నివేదికను ఖచ్చితంగా కేంద్ర ప్రభుత్వానికి చెందిన వీశీజుఖీడజజ మరియు చీూదీూ గుర్తింపు పొందిన థర్డ్ పార్టీ సంస్థతో ఆడిటింగ్ చేయించి మాత్రమే సమర్పించాలనేది కఠినమైన చట్టం.

**కోరమాండల్ వంటి దిగ్గజాలదే ఈ దారి:**

**నివేదికలు లేకపోతే ముంచుకొచ్చే ముప్పు ఇదే!**

విశ్వసనీయ సమాచారం ప్రకారం, ప్రముఖ ఎరువుల సంస్థ కోరమాండల్ వంటి దిగ్గజ పరిశ్రమలు కూడా ఈ నివేదికలను సమర్పించడంలో నిర్లక్ష్యం వహించడం విస్మయానికి గురిచేస్తోంది. ఈ నివేదికలు సమర్పించకపోవడం కేవలం సాంకేతిక లోపం కాదు, అది ఒక పెను ప్రమాదానికి సంకేతం. ఆడిటింగ్ నివేదికలు లేకపోతే సదరు పరిశ్రమలు వదులుతున్న రసాయన వ్యర్థాల మోతాదు ఎంత ఉందో బయటపడదు. దీనివల్ల వాతావరణంలోకి విడుదలయ్యే అమోనియా, సల్ఫర్ వంటి ప్రాణాంతక వాయువుల వల్ల ఏ క్షణమైనా ప్రజలు ఊపిరి ఆడక ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. గతంలో జరిగిన పారిశ్రామిక దుర్ఘటనలకు ఇటువంటి నివేదికల దాగుడుమూతలే ప్రధాన కారణమని తెలిసినా, కోరమాండల్ వంటి సంస్థలు బేఖాతరు చేయడం గమనార్హం.

**కేంద్ర ఆడిట్ నివేదికలు లేవంటే.. నిబంధనలు తుంగలో తొక్కినట్లే!**

రాష్ట్రంలోని 70 శాతం పరిశ్రమలు ఈ కేంద్ర ఆడిట్ నివేదికలను సమర్పించడంలో విఫలమవ్వడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది. కేంద్ర సంస్థల పర్యవేక్షణలో ఆడిటింగ్ జరిగితే పరిశ్రమలు వదులుతున్న విషవాయువులు, రసాయన వ్యర్థాల అసలు రంగు బయటపడుతుంది. ఆ నిజాన్ని దాచడానికే ఈ నివేదికలను అటకెక్కించారు. నివేదిక ఇవ్వట్లేదు అంటే అర్థం ఆ పరిశ్రమలు కాలుష్య నియంత్రణ యంత్రాలను వాడటం లేదు, నిబంధనలను బేఖాతరు చేస్తున్నాయని స్పష్టమవుతోంది.

**వ్యాధుల వలయంలో మానవ సమాజం: చిన్నారుల విలవిల!**

పరిశ్రమల నుంచి వస్తున్న విషతుల్యమైన గాలులు, కలుషిత నీరు సామాన్యుడి పాలిట యమపాశాలుగా మారుతున్నాయి. క్షేత్రస్థాయిలో పరిస్థితి అత్యంత భయానకంగా ఉంది:

– కంటి మంటలు – చర్మ వ్యాధులు: పరిశ్రమలు వదులుతున్న కాలుష్యం కారణంగా పసిపిల్లల కళ్ళు మంటలతో ఎర్రబడుతున్నాయి. ఒళ్లంతా దద్దుర్లు రావడం, దురదలతో జనం బెంబేలెత్తిపోతున్నారు.

– శ్వాసకోస సమస్యలు: విషవాయువుల ప్రభావంతో ఊపిరితిత్తుల వ్యాధులు ప్రబలుతున్నాయి. కంటి రోగాలు, చర్మ వ్యాధులతో ఆసుపత్రులు నిండుతున్నా అధికారులకు చీమ కుట్టినట్లయినా లేదు.

– భవిష్యత్తుపై భయం: ఆరోగ్యవంతులైన పౌరులు ఉండాల్సిన చోట, రోగాల బారిన పడిన సమాజం మిగులుతోంది. ఈ దుస్థితికి కారణం పరిశ్రమల స్వార్థం, అధికారుల నిర్లక్ష్యం కాదా?

**రైతు గోస.. మూగజీవాల మృత్యుఘోష!**

**ప్రకృతి సమతుల్యత కూడా పూర్తిగా దెబ్బతింటోంది:**

– అన్నదాత ఆవేదన: రసాయన వ్యర్థాలు నేరుగా పంట పొలాల్లోకి చేరుతుండటంతో భూమి నిస్సారమైపోతోంది. ఒకప్పుడు పసిడి పంటలు పండిన నేలలు నేడు విషపు గడ్డలుగా మారుతున్నాయి.

– పక్షుల విలవిల: ఆకాశంలో స్వేచ్ఛగా ఎగరాల్సిన పక్షులు విషవాయువులకు ఊపిరి ఆడక రాలిపోతున్నాయి. పశువులు కలుషిత నీరు తాగి అకాల మరణం చెందుతున్నాయి.

**వ్యవస్థ ప్రక్షాళన అవసరం: అధికారుల మౌనం వీడాలి!**

ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో పర్యవేక్షకులుగా నిలవాలి. లక్షల రూపాయల లంచాలకు ఆశపడి, నివేదికలు ఇవ్వని పరిశ్రమల వైపు కళ్లు మూసుకుంటే సమాజం క్షమించదు. పర్యావరణ పరిరక్షణ అనేది ఒక జీవనాడి అని గుర్తించి, వీశీజుఖీడజజ మరియు చీూదీూ నిబంధనలను బేఖాతరు చేసే పరిశ్రమలపై ఉక్కుపాదం మోపాల్సిన బాధ్యత మీపై ఉంది. చట్టం ముందు అందరూ సమానమేనని నిరూపించాల్సిన సమయం ఆసన్నమైంది.

**ఇప్పుడైనా ఉక్కుపాదం మోపాలి!**

ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించడం ప్రభుత్వ అధికారుల ప్రాథమిక లక్ష్యం కావాలి. నివేదికలు ఇవ్వని పరిశ్రమలపై తక్షణమే కఠిన ఏపీపీసీబీ అధికారులు కఠినంగా వ్యవహరిస్తూ చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలి. పరిశ్రమల యజమానులు తమ లాభాలతో పాటు పర్యావరణ పరిరక్షణను ఒక బాధ్యతగా గుర్తించేలా అధికారులు దిశానిర్దేశం చేయాలి. లేదంటే, రాబోయే రోజుల్లో ప్రజల ఆగ్రహానికి యంత్రాంగం సమాధానం చెప్పుకోక తప్పదు.

# గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు పూర్తి





**భీమవరం,మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టరేట్ పెరేడ్ గ్రౌండ్ లో జనవరి 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు పూర్తి అయినవని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఏర్పాట్లలో భాగంగా మూడు పెద్ద డయాస్ లు, రెండు చిన్న డయాస్ లు, ఒక గ్యాలరీ, స్టాల్స్, వివిధ శాఖలకు సంబంధించిన శకటాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

వేడుకల నిర్వహణ సందర్భంగా ప్రభుత్వ పథకాలు ప్రతిబింబించేలా శకటాలు, స్టాల్స్ ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. గణతంత్ర దినోత్సవం వేడుకల్లో ప్రోటోకాల్ ను అనుసరించి సీటింగు ఏర్పాట్లను, స్టేజీ ఏర్పాట్లు, త్రాగునీటి సరఫరా, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టం, తదితర పటిష్ట ఏర్పాట్లు చేయడం జరిగింది అన్నారు. విద్యుత్తు సరఫరాలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని, ప్రత్యామ్నాయంగా జనరేటరు కూడా ఏర్పాటు చెయ్యాలని విద్యుత్తు శాఖ అధికారులను ఆదేశించామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం,ఓఆర్ యస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు, అంబులెన్స్ సేవలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. అధికారులందరూ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేలా సమన్వయంతో పని చేయాలని కోరారు.

వేడుకలలో భాగంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను ప్రేక్షకులు వీక్షించేలా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. వేడుకల్లో వివిధ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొననున్న దృష్ట్యా తగిన విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వేడుకలను ఎక్కువ మంది ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఏర్పాట్లు కట్టు దిట్టంగా ఉండాలని అన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా జిల్లా కలెక్టరేట్ ను అలంకరించిన రంగు రంగుల విద్యుత్ బల్బులు కనువిందు చేస్తున్నాయి.

# రత్నగిరిపై రథసప్తమి సంబరం

మొదటిపేజి తరువాయి

వస్తున్న మార్పులను ప్రతిబింబించేలా సాగిన కీర్తనలాలాపన భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపింది.

**సమర్థవంతమైన పర్యవేక్షణలో ఏర్పాట్లు..**ఈ సందర్భంగా ఈఓ వేంద్ర త్రినాథరావు మాట్లాడుతూ..స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. రథసప్తమి విశిష్టతను చాటిచెప్పేలా సాంస్కృతిక కార్యక్రమాలను రూపొందించామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను జయప్రదం చేయడం సంతోషదాయకమని ఆయన అన్నారు.

**పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు..**పవిత్ర రత్నగిరి గిరులపై సూర్యకిరణాలు ప్రసరిస్తున్న వేళ, భక్తులు స్వామివారిని దర్శించుకుని కళామందిరంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలను తిలకించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఏఈఓలు, వీఆర్వో గణపతి, డిసి దొరబాబు వివిధ విభాగాల అధికారులు, అర్చక స్వాములు మరియు సిబ్బంది పాల్గొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# మద్యం మాఫియా డాన్ ‘జోగి’కి జైలు శిక్ష తప్పదు!

మొదటిపేజి తరువాయి

లిక్కర్ విధానం కాదు.. అది కమీషన్ల రాజ్యం.జె-బ్రాండ్ల పేరుతో నాణ్యతలేనిమద్యం విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు.

**దోపిడీ పర్వం:**ఇసుక,భూములు, గనులు, చివరకు అగ్రిగోల్డ్ భూములను కూడా వదలకుండా దోచుకున్న చరిత్ర వైసీపీది.

**దెయ్యాలు వేదాలు వల్లించినట్టు:** దేవుడి సాక్షిగా ప్రమాణాలకు పిలవడం చూస్తుంటే సిగ్గుచేటని, తప్పు చేసినవాడు దేవుడిపేరుచెప్పి తప్పించు కోలేడని అన్నారు.

**కులం కార్డుపై ఘాటు విమర్శ**

బీసీ కార్డును వాడుకుంటున్న జోగి రమేష్‌ను మంత్రి ప్రశ్నిస్తూ.. “అనాడు గుంటూరులో బీసీ కుర్రాడు అమర్నాథ్ చనిపోతే మీ కులం గుర్తుకు రాలేదా? నాడు జగన్ దృష్టిలో పడేందుకు మీరు చేసిన అక్రమాలు ప్రజలు మర్చిపోలేదు. అధికారం పోయాక ఇప్పుడు కులం గుర్తుకు వచ్చిందా?” అని నిలదీశారు. “ఇల్లు కాల్చేవాడు దీపం పట్టుకుని న్యాయం మాట్లాడితే ఎలా ఉంటుందో.. జోగి రమేష్ తీరు కూడా అలాగే ఉంది. పాపం పండినప్పుడు శిక్ష తప్పదు” అని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.

అవినీతికి ‘నో ఛాన్స్’.. అక్రమాలకు ‘నో మాఫీ’

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారదర్శక పాలనకు పెద్దపీట వేస్తున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రతి అవినీతిని వెలికితీస్తామని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం, భవిష్యత్తుతో ఆడుకున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని మంత్రి సుభాష్ హెచ్చరించారు.

# సూర్య ప్రభ - చంద్రప్రభ వాహనాలపై చిన్న వెంకన్న తిరువీధి సేవ



**ద్వారకాతిరుమల, మేజర్ న్యూస్:** ప్రధాన దేవాలయాల్లో ఒకటైన చిన్న వెంకన్న ఆలయంలో రథసప్తని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ముందుగా వివిధ రకాల పుష్పాలంకరణలతో ఏర్పాటు చేసిన సూర్యప్రభ వాహనంపై స్వామి అమ్మవార్లను ఉంచి అర్చకులు పూజలు జరిపి హారతులు ఇచ్చారు.అనంతరం గ్రామంలోని ప్రధాన వీధులలో డోలు సన్నాయి మేళాలు కోలాట నృత్యాల నడుమ స్వామివారిని ఊరేగించారు.భక్తులు స్వామివారిని దర్శించుకుని హారతులు ఇచ్చి టెంకాయలను సమర్పించారు. సాయంత్రం ఏడు గంటలకు చంద్రప్రవాహనంపై స్వామి అమ్మవార్లను గ్రామ పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని హారతులు అందుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# ఘనంగా స్వామివారి సూర్యప్రభ వాహన సేవ





**– గోవిందగిరిపై 'రథసప్తమి' వేడుకలు**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రథసప్తమి సందర్భంగా రంపచోడవరం మండలం ఐ.పోలవరం వద్ద గోవిందగిరిపై శ్రీ వెంకటేశ్వర స్వామివారి సూర్యప్రభ వాహన సేవ ఆదివారం ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో గోవిందగిరిపై శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారికి సూర్యప్రభ వాహనంపై తిరుమాడ వీధి సేవను భక్తుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం సూర్యప్రభ వాహనంపై విరాజిల్లి తిరుమాడ వీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. రథసప్తమి నాడు సూర్యనారాయణమూర్తి అనుగ్రహం విశేషమని, సూర్యప్రభ వాహన సేవకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని ఆలయ అర్చకులు పార్థు స్వామి, మణికంఠ స్వామి ఈ సందర్భంగా తెలిపారు. వాహన సేవ పూర్తయ్యాక వాహన సేవకులకు, హాజరైన భక్తులకు స్వామివారి ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ అధికారులు ఈ రూప్ సాయి ఢిల్లీ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వాహన సేవ ప్రారంభం నుంచి ముగింపు వరకు ఆలయ అధికారులు, విజిలెన్స్ విభాగం వారు సమన్వయంతో జాగ్రత్తగా నిర్వహించారని, అర్చకుల పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు సజావుగా జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమం భక్తి, ఆధ్యాత్మిక వాతావరణంలో విజయవంతంగా సూర్యప్రభ వాహన సేవ పూర్తి అయింది. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## ఢిల్లీ రిపబ్లిక్ డే వేడుకలకు రావులపాలెం విద్యార్థి వినయ్



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎస్సి ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్ కోరుకొండ వినయ్ న్యూఢిల్లీ ఇండియా గేట్ రాజ్ పత్‌లో 26వ తేదీన జరుగ నున్న రిపబ్లిక్ డే మార్చ్‌ఫాస్ట్ ఉత్సవాలలో పాల్గొన నున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాస రావు, ఎన్.ఎస్.ఎస్. అధికారి ఎస్.అరుణ్ కుమార్ తెలిపారు. కళాశాల నుండి మొదటిసారిగా రిపబ్లిక్ డే పెరేడ్ న్యూఢిల్లీ ఉత్సవాలకు ఎన్.ఎస్.ఎస్. తరుపున కోరుకొండ వినయ్ ఎంపిక కావడం ఎంతో అభినందనీయమని తెలియజేసారు. ఈ విద్యార్థి సుమారుగా 45 రోజుల నుండి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ వారి ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో మార్చ్ పాస్ట్ ప్రాక్టీస్ ట్రైనింగ్ తీసుకుంటున్నట్లు తెలియజేసారు. ఈ ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్‌కి కళాశాల సిబ్బంది, అభివృద్ధి కమిటీ చైర్మన్ పొత్తంశెట్టి కనికిరెడ్డి, మెంబర్ పిచ్చేటి చిన్నారావు, జక్కంపూడి రామకృష్ణ తదితరులు అభినందనలు తెలియజేసినారు.

## నేటి నుండి వాడపల్లిలో శ్రీనివాస శరణాగత దీక్ష

**– గోవింద మాలధారణ చేసిన భక్తులు**



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్:** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో మాఘశుద్ధ సప్తమి సందర్భంగా భక్తులు శ్రీనివాస శరణాగత దీక్ష చేపట్టారు. అర్థ మండల దీక్షగా నేటి నుంచి వచ్చేనెల 16వ తేదీ, మాఘ బహుళ చతుర్దశి వరకు భక్తులు గోవింద మాల ధరించి దీక్షాదారులై ఉంటారు. ఆరోజు పూర్ణాహుతితో ఈ దీక్ష పూర్తవుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. శ్రీనివాస శరణాగత దీక్షను చేబూనిన గోవింద మాలాధారులను ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు అభినందించారు.

# ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి సమావేశం

**చింతూరు, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా చింతూరు మండలంలోని ఆదివారం ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి సమావేశం స్థానిక ఆదివాసి సంక్షేమ పరిషత్ కార్యాలయంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి సోడే రాఘవయ్య అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు బంగారు వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ చింతూరు డివిజన్లో ఆదివాసి సంక్షేమ పరిషత్ సంస్థ గత ఎన్నికలు ఫిబ్రవరి 15న, 4 మండలాల్లో అధ్యక్ష కార్యదర్శులు ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఈ సమావేశంలో ఆయన తెలియజేశారు. తదనంతరం డివిజన్ జిల్లా స్థాయి ఎన్నికలు నిర్వహించబ తున్నట్లు ఆయన తెలిపారు. ఏజెన్సీలో ఆదివాసి చట్టాలు అమలుకు నోచుకోకపోవడంపై మరియు ఏజెన్సీలో రాజకీయ పార్టీల కుట్రలను త్రిప్పికొట్టుటకు పటిష్టమైన కార్యచరణ రూపొందించుటకు ఆదివాసి సంక్షేమ పరిషత్ సిద్ధమవ్వాలని ఆయన పేర్కొన్నారు. ఈ




సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వీరభద్రం, డివిజన్ అధ్యక్షులు కారం రవి, నాలుగు మండలాల అధ్యక్షులు పాయం లక్ష్మణరావు, మినప నాగేశ్వరరావు, సోడే ప్రసాద్, కారం సంకురమ్మ, పొడియం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకన్న ఆలయంలో వైభవంగా రథసప్తమి వేడుకలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో రథసప్తమి పర్వదినాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి సూర్య నమస్కారాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారు సూర్యప్రభ వాహనంపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే ఆలయ ధర్మకర్తలు చెల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్, పెండ్యాల భవాని, చలుమూరు రాంబాబు, గంగవరపు పద్మావతి, వాడపల్లి సుందర శేషావతారం, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. స్వామివారి ఊరేగింపులో పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొని భక్తి పారవశ్యంతో స్వామివారిని దర్శించుకుని తరించారు. రథసప్తమి సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తుల జయజయ ధ్వానాలతో మార్మోగాయి. ఈ సందర్భంగా ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# ఘనంగా ఓటర్ల దినోత్సవం



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్:** జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఆత్రేయపురం గ్రామంలో తాసిల్దార్ ఆర్.డి. రామచంద్ర మూర్తి ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు, స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గులు పోటీలు, వ్యాస రచనలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ పి.ఎస్.రాజు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ యం.భాను, గ్రామ రెవెన్యూ అధికారులు, బిఎల్ఓ లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ,
ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు,
మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# శెట్టిబలిజల జాతి చరిత్రను చాటి చెప్పిన "దొమ్మేటి వెంకటరెడ్డి"





- దొమ్మేటి వెంకటరెడ్డి గొప్ప సామాజిక ఉద్యమకారుడు
- విగ్రహ ఆవిష్కరణ సభలో మంత్రి వాసంశెట్టి సుభాష్

**అలమూరు, మేజర్ న్యూస్ :** శెట్టిబలిజ జాతి పితామహుడిగా, సామాజిక ఉద్యమ కారుడిగా గుర్తింపు పొందిన దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలు ఆదర్శనీయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అలమూరులో ఎస్ఏఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, సివిల్ సప్లై డైరెక్టర్ కడలి ఈశ్వరి, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, వాసంశెట్టి చినబాబు తదితరుల సమక్షంలో ఘనంగా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డి కేవలం ఒక వ్యక్తి కాదని ఒక ఉద్యమం, ఒక ఆలోచన, ఒక మార్గదర్శకుడు అని కొనియాడారు. శెట్టిబలిజ జాతి ఆత్మగౌరవం, ఐక్యత, విద్యా-సామాజిక అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు స్వరం ఇచ్చిన నాయకుడిగా, హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడిన మహనీయుడిగా దొమ్మేటి వెంకటరెడ్డి చరిత్రలో నిలిచిపోయారని మంత్రి పేర్కొన్నారు.

ఆయన చూపిన మార్గంలో నడవడమే నిజమైన నివాళి అవుతుందన్నారు. అన్ని వర్గాలను గౌరవిస్తూనే శెట్టిబలిజల అభివృద్ధి కి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయం, అన్ని వర్గాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని,దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలకు అనుగుణంగా శెట్టిబలిజ జాతి అభ్యున్నతికి అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘం నేతలు చొల్లంగి వెంకటరమణ, వాసంశెట్టి చినబాబు, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొని దొమ్మేటి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

# పశు ఆరోగ్య శిబిరంలో పాల్గొన్న ఉన్నతాధికారులు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, ఆర్.బి.పట్నం గ్రామంలో పశు వైద్యాధికారి డా.గోలి వీర్రాజు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరంలో పశు సంవర్ధక శాఖ డి.డి. (విజయవాడ) స్పెషల్ ఆఫీసర్ రామ్‌ప్రసాద్, కాకినాడ డిడి అంబేద్కర్‌లు పాల్గొని పశు ఆరోగ్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పశువులకు టీకాలు వేసే విధానాన్ని పరిశీలించి, పశు ఆరోగ్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. పశువైద్యాధికారి డా.గోలి వీర్రాజు మాట్లాడుతూ ఈ శిబిరంలో పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేయడం జరిగిందని, అలాగే పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, పశువులలో వచ్చే గర్భకోశక సంబంధించిన వ్యాధులు, చూడు పరీక్షలు చేయడం జరిగిందని, లేగదూడలలో ఏలిక పాముల నివారణకు మందుల పంపిణీ చేశారు. దీనివలన మరణాలు అరికట్టవచ్చునని పశు వైద్యాధికారి డా.గోలి వీర్రాజు తెలిపారు. దీనిలో భాగంగా 32మంది రైతులకు సంబంధించిన 130 పశువులకు 450 గొర్రెలకు వివిధ రకాల పరీక్షలు చేశారు.

ఈ కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ మేనేజర్ బర్రె నాగేశ్వరరావు, పిఎసిఎస్ చైర్మన్, కూటమి నాయకులు, గ్రామ రైతులు, పశు వైద్య సిబ్బంది జి.అజయ్ సూర్య, కె.అక్షయ్, శ్రీనివాస్, మరియు రిలయన్స్ ఫౌండేషన్ సిబ్బంది యు.రమేష్‌బాబు, పాడిరైతులు పాల్గొన్నారు.

# ఘనంగా రథసప్తమి హోమాలు





**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక గోదారిగుంట శ్రీ రమా సహిత సత్యదేవ మందిర ప్రాంగణంలో రథసప్తమి సందర్భంగా ఆదివారం పూజలు, హోమాలు నిర్వహించారు. యాతగిరి మద్వేష్ ఆధ్వర్యంలో సూర్య హోమము, నవగ్రహ హోమము, ధన్వంతరి హోమము మరియు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవతి నక్షత్ర యుక్త ఆదివారం నాడు రథసప్తమి రావడం ఎంతో విశేషమని ఆరోజు ఆదిత్య అనుగ్రహం కోసం పూజలు, జపాలు ఆలయ దర్శనాలు ఎంతో శ్రేష్ఠమన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవనం కొనసాగి ంచాలన్న ప్రధాన ఆశయంతో ఇటువంటి విశేష కార్యక్రమాలను గురువులైన శ్రీ సత్యాత్మ తీర్థ స్వామీజీ అనుగ్రహంతో నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రాతఃకాల పూజ సమయంలో శ్రీ రమా సహిత సత్యదేవ, శ్రీ దాసాంజనేయ మరియు ఉమా సాంబశివ స్వామివార్లకు అభిషేక కార్యక్ర మాలు నిర్వహించి శ్రీ భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారికి విశేష అర్చన నిర్వహించామన్నారు. బెంగళూరుకి చెందిన ధర్మవరపు దేవరాజరావు కుటుంబ సభ్యుల గోత్రనామాలతో తొలి పూజా కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం విశేష సాలగ్రామ పూజ అభిషేకాదులు జరిగాయని మద్వేష్ తెలిపారు. విశేష పూజలు నిర్వహించుకున్న శ్రీవిద్య మోహనకృష్ణ దంపతులు, హేమ భీమసేన రావు దంపతులు, ద్రౌపతమ్మ కుటుంబ సభ్యులు, అనేకమంది భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. రథసప్తమి సందర్భంగా ప్రత్యేక క్షీరాన్న నివేదన కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం ప్రసాద వినియోగ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూర్ణాహుతి కార్యక్రమాన్ని మౌనిక మద్వేష దంపతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించి హోమ రక్షా ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు.

## గోరింటలో వైభవంగా ప్రారంభమైన ఏకాహం

- పాల్గొన్న పలు భజన సమాజాలు



**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం మండలం, గోరింటలో వేం చేసియున్న చినరామాలయం (శెట్టిబలిజ రామాల యం) వద్ద ఆదివారం ఉదయం స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సంవత్సరం మాఘ శుద్ధ సప్తమి పురస్కరించుకుని ఆదివారం ఉదయం 5 గంటల నుండి పుణ్యదంపతుల పూజా కార్యక్రమాలతో ఉదయం 6 గంటల నుండి ఏకాహం కార్యక్రమం శెట్టిబలిజ సంఘ సభ్యులు, గ్రామ ప్రజల ధన సహాయంతో, గ్రామ పురోహితులు గోవిందవర్జుల శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో శ్రీ శివరామ బాలభక్త భజన సమాజం సభ్యులు ఆధ్వర్యంలో శ్రీశివరామ బాలభక్త భజన సమాజం అధ్యక్షులు పచ్చిపాల ప్రసాదరావు పర్యవేక్షణలో అత్యంత వైభవంగా ఈ ఏకాహం కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్ర మంలో పలు భజన సమాజాలతో పాటు భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీశివరామ బాలభక్త భజన సమాజం అధ్యక్షులు మరియు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శ్రీ విఘ్నేశ్వర భజన కళాకారుల సంఘం జాయింట్ సెక్రటరీ పచ్చిపాల ప్రసాదరావు తెలుపుతూ ఈ ఏకాహం ఆదివారం ఉదయం 6 గంటల నుండి సోమవారం ఉదయం 6 గంటల వరకు దిగ్విజయంగా నిర్వహించడం జరుగుతుందని, మొదటి రోజు పలు మహిళా భజన సమాజాలతో పాటు, పలు భజన సమాజాలు పాల్గొన్నాయని, ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు భజన కళాకారులు, గ్రామ ప్రజలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏలేశ్వరంలో ఘనంగా స్పార్క్ జీనో సమ్మిట్..



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొట్ట మొదట సరిగా నిర్వహించబడిన ఎక్స్ ఇన్నో సమ్మిట్ కృత్రిమ మేధస్సు సైబర్ సెక్యూరిటీ, మరియు ఎంట్రప్రెన్యూర్‌షిప్ అభివృద్ధి రంగాలపై దృష్టి సారిస్తూ నిలిచింది. ఈ సమ్మిట్‌ను స్పార్క్ ఫౌండేషన్ నిర్వహించగా, సహ-భాగస్వామిగా, గ్రోవ్ గ్రోత్ గూగుల్ జెమినీ టెక్నాలజీ భాగస్వామిగా వ్యవహరించాయి. ఈ కార్యక్రమాన్ని కాకినాడ జిల్లా, ఏలేశ్వరంలో వేదిక ప్రయివేట్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జి జి యు చైర్మన్ సత్యనారాయణ రాజు, ఐఎఫ్ఎస్ అధికారి శివకుమార్ గంగల్, మణిహంస పవర్ ప్రాజెక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ వెలగలవెంకట రెడ్డి, స్పార్క్ ఫౌండేషన్ చైర్మన్ సాయి సందీప్, సీఈఓ సాయి ప్రదీప్, గ్రోవ్ గ్రోత్ వ్యవస్థాపకుడు మరియు సీఈఓ మనోజ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

## మల్లేశ్వరంలో ఓటర్స్ డే వేడుకలు



**పెరవలి, మేజర్ న్యూస్ :** ఓటర్ డే సందర్భంగా జనవరి 25వ తేదీ ఆదివారం మల్లేశ్వరం గ్రామంలో సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లు తానంకి వెంకట్రావు, మేకల అప్పారావు, మేడిచర్ల జగన్ మోహన్ రావులను సంబంధిత బిఎల్వోలు, వీఆర్వో సచివాలయ సిబ్బందితో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్వరం గ్రామ ఉపసర్పంచ్ బొలిశెట్టి పట్టాభి రామారావు, కోటిపల్లి మురళీకృష్ణ, మేడిచర్ల భాస్కర్ శివకుమార్, వీఆర్వో శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# యువతీ యువకులు ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలి






**– జాతీయ ఓటరు దినోత్సవంలో ఐటీడీఏ పిఓ**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** పోలవరం (రంపచోడవరం) జిల్లా పరిధిలో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, పోలవరం ఇంచార్జ్ జిల్లా జాయింట్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయము జాతీయ ఓటర్ దినోత్సవం పురస్కరించుకొని ముందుగా తాసిల్దార్ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ఓటు హక్కు ఉపయోగాల నినాదంతో వివిధ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులతో, రంపచోడవరం మండలంలోని సచివాలయాలకు సంబంధించిన సిబ్బందితో, పోలింగ్ బూత్ స్థాయి అధికారులతో, డిప్యూటీ తాసిల్దార్లతో, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి,జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్, రంపచోడవరం సబ్ కలెక్టర్, చింతూరు ప్రాజెక్ట్ అధికారి శుభం నొక్వాల్, ఎస్టి కమిషన్ మెంబర్ గొర్లె సునీత, తాసిల్దార్ పి.బాలాజీ భారీ ర్యాలీ నిర్వహించారు అనంతరం అంబేద్కర్ సెంటర్లో ఓటు హక్కు వినియోగంపై ఈ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా తాసిల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన జాతీయ 16వ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్ మాట్లాడుతూ నూతన పోలవరం జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు వెంటనే ఆన్లైన్లో గాని, మాన్యువల్ దరఖాస్తులను తాసిల్దార్ కార్యాలయంలో సమర్పించవచ్చని ఆయన తెలిపారు. ఓటు హక్కు కలిగిన ప్రతి వ్యక్తి నిర్భయంగా మీకు నచ్చిన అభ్యర్థులకు ఓటు వేసే హక్కు మన భారత రాజ్యాంగం హక్కు కల్పించిందని ఆయన అన్నారు. జిల్లాలోని ఎలాక్ట్రోల్ అధికారిగా జిల్లా కలెక్టర్ వారు ఉంటారని, డివిజన్ స్థాయిలో సబ్ కలెక్టర్, రెవిన్యూ డివిజనల్ అధికారులు ఉంటారని, మండల స్థాయిలో తాసిల్దార్లు ఉంటారని ఆయన అన్నారు.

రంపచోడవరం సబ్ కలెక్టర్, చింతూరు ప్రాజెక్ట్ అధికారి శుభం నొక్వాల్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులకు తప్పనిసరిగా ఓటర్ ఎన్రోల్మెంట్ తప్పనిసరిగా చేసుకొని రానున్న రోజుల్లో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మీకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయవచ్చని ఆయన అన్నారు. రంపచోడవరం నియోజకవర్గం లో అన్ని పోలింగ్ బూతులకు బి ఎల్ ఓ లను ఎక్కడికక్కడ ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. 18 సంవత్సరాల నిండిన వెంటనే ఓటు హక్కుకు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన అన్నారు. ఓటర్ ఎన్రోల్మెంట్ తీసుకొనుటకు ఎన్నికల కమిషన్ ఒక యాప్ కూడా ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు.

రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె సునీత మాట్లాడుతూ మన భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఓటు హక్కు చాలా ముఖ్యమైనదని ఆమె అన్నారు. మన దేశం, మన రాష్ట్రం అభివృద్ధి చేసుకొనుటకు మంచి నాయకున్ని ఎన్నుకునేందుకు ఓటు హక్కు ఉపయోగపడుతుందని ఆమె అన్నారు.

వైస్ ఎంపీపీ బాలకృష్ణ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు దరఖాస్తులు ఆన్లైన్లో గాని, మ్యాన్యుల్లో గాని తాసిల్దార్ వారి కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని ఆయన అన్నారు.

అనంతరం ముగ్గుల పోటీలు, ఎస్సే రైటింగ్, క్విజ్ పోటీలు, స్పీచ్ తదితర పోటీలలో ప్రతిభ కనబరిచిన 23 మందికి సర్టిఫికెట్లు అదేవిధంగా మండలంలోని బిఎల్ఓ లందరికీ సర్టిఫికెట్లు అదేవిధంగా సీనియర్ సిటిజనులకు పూలదండలతో సాల్వాలతో సన్మానించడం జరిగింది. అదేవిధంగా కొత్తగా 18 సంవత్సరాలు నిండిన ఐదుగురు యువతి యువకులకు ఓటర్ కార్డులు సబ్ కలెక్టర్ వారి, ఎస్టి కమిషన్ మెంబర్ వారి చేతుల మీదుగా అందజేయడం జరిగింది. అనంతరం ముఖ్య అతిథులైన సబ్ కలెక్టర్కి, ఎస్టి కమిషన్ మెంబర్కి, వైస్ ఎంపీపీ బాలకృష్ణకి, మాజీ సర్పంచ్ నిరంజని దేవికి, రంపచోడవరం తాసిల్దార్ పి.బాలాజీ అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పి.బాలాజీ,ఎంపీడీవో ప్రసాద్, మాజీ సర్పంచ్ వై.నిరంజని దేవి, డిప్యూటీ తాసిల్దారులు షేక్ పాయాజ్ భాష (జిలాని) సునీత, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సిహెచ్.నిర్మల, వీఆర్వోలు పి.రవికుమార్, చిన్న రాజు, ఇందిర, సత్యనారాయణ, ప్రభ, శివకుమార్, ఆనంద్, కార్యాలయ సిబ్బంది ప్రుధ్వీ,మణికంఠ, వివిధ పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, వీఆర్వోలు,వీఆర?లు తదితరులు పాల్గొన్నారు.

# 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం






**– జనవరి 26న కాకినాడ పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ జెండా ఆవిష్కరణ**

**– ప్రజలకు జిల్లా ప్రగతిపై సందేశం ఇవ్వనున్న ఇంచార్జి జిల్లా కలెక్టర్ అపూర్వ భరత్**

**కాకినాడ,మేజర్న్యూస్ :** 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జనవరి 26న కాకినాడ పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు సర్వం పూర్తి చేశారు.

77వ గణతంత్ర దినోత్సవం వేడుకల్లో భాగంగా జిల్లా ఇన్చార్జి జిల్లా కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ జనవరి 26 ఉదయం 9.00 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీస్ గౌరవ వందన్ని స్వీకరిస్తారు. అనంతరం జిల్లా ప్రగతిపై ప్రజలకు సందేశం ఇవ్వనున్నారు. తదుపరి శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, విశిష్ట సేవలకు గుర్తింపుగా అధికారులు, సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేస్తారు. ఇప్పటికే ముందస్తు ఏర్పాట్లపై జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, వివిధ శాఖల అధికారులతో కలిసి గణతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జెండా ఆవిష్కరణ వేదిక, అతిథుల గ్యాలరీ, పరేడ్ మైదానం, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలను పరిశీలించారు.ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే స్టాల్స్, వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించే శకటాల ప్రదర్శన ఆకట్టుకునే విధంగా ఏర్పాట్లు పూర్తి అవుతున్నాయి. జిల్లా స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకలు మరింత వైభవంగా, ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జిల్లా యంత్రాంగం చేస్తున్నది.

ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. **గణతంత్ర వేడుకలకు ముస్తాబైన కాకినాడ జిల్లా..** 77వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని కాకినాడ జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు అన్ని ముస్తాబు చేసారు. కాకినాడ పట్టణంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం, జిల్లా ప్రజా పరిషత్తు, కాకినాడ ఆర్డీవో ఇతర ప్రభుత్వ కార్యాలయాలు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

## దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది

**– జగ్గిరెడ్డిపై గుత్తుల సాయి ధ్వజం**



**అమలాపురం, మేజర్ న్యూస్ :** జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు నివాసంలోఆదివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు గుత్తుల సాయి వైఎస్సార్సీపీ తీరుపై నిప్పులు చెరిగారు. అధికార దుర్వినియోగం గురించి జగ్గిరెడ్డి నీవు మాట్లాడుతున్నావా అంటూ గుత్తుల సాయి ప్రశ్నించారు. గత ఐదేళ్ల పాలనలో పోలీసులను అడ్డం పెట్టుకుని టీడీపీ కార్యకర్తలను వేధించిన చరిత్ర మీది కాదా అని నిలదీశారు. సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించిన ఎమ్మెల్యేకు మద్దతు తెలిపారు. అమలాపురం ఎమ్మెల్యే ఐతాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు అత్యంత అద్భుతంగా నిర్వహించారని, అది చూడలేకనే బొమ్మి ఇజ్రాయెల్ వంటి వారు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండి పడ్డారు. మీ నాయకులు ఏనాడైనా ప్రజల కోసం ఇలాంటి ఉత్సవాలు చేశారా? అని సవాల్ విసిరారు. నిబంధనల పాలన: ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చట్టప్రకారం పని చేస్తోందని, తప్పు చేసినవారిపై చర్యలు తీసుకుంటే వాటిని అక్రమ కేసులు అనడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు జగ్గిరెడ్డికి లేదని, కూటమి ప్రభుత్వంలోనే కోనసీమకు నిధులు, తగిన గుర్తింపు దక్కుతున్నాయని స్పష్టం చేశారు. ఈ ప్రెస్ మీట్లో జిల్లా స్థాయి కీలక నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి గందం పల్లంరాజు, యాళ్ళ దొరబాబు, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు చిక్కాల గణేష్, మున్సిపల్ మాజీ చైర్మన్, ముఖ్య నేతలు చెల్లి అశోక్, తాడి నరసింహారావు, వాసంశెట్టి చినబాబు, మోకా సుబ్బారావు, తిక్కిరెడ్డి నేతాజీ, సుదా చిన్నా, చిల్లా పురుషోత్తం, బోనం సత్తిబాబు, ఏడిద శ్రీను, అబ్బిరెడ్డి చంటి, బొర్రా చిట్టిబాబు, చిక్కాల రాంబాబు, కొప్పుల నాగ మానస, తిక్కా ప్రసాద్, మద్దాల నాగ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అభివృద్ధికి మెట్టు

**7వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి చంద్రమౌళీశ్వరి**





**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు అభివృద్ధికి మెట్టు అని 7వ అదనపు జిల్లా సెషన్స్ (ఫాస్ట్ ట్రాక్ కోర్టు) జడ్జి జి.చంద్రమౌళీశ్వరి తెలిపారు. ఆదివారం 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం (మై ఇండియా–మై ఓట్) పెద్దాపురం నియోజకవర్గ ఆర్వో మరియు ఆర్డీఓ కె.శ్రీరమణి ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం నందు నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా పెద్దాపురం 7వ అదనపు జిల్లా సెషన్స్ (ఫాస్ట్ ట్రాక్ కోర్టు) జడ్జి జి.చంద్రమౌళీశ్వరి పాల్గొని మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు అభివృద్ధికి మెట్టు అని ఆమె తెలిపారు. అనంతరం ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ స్థానిక ఆర్డీఓ కార్యాలయం నుండి మున్సిపల్ సెంటర్ వరకు ఆర్డీఓ కె.శ్రీ రమణి, తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీల ఆధ్వర్యంలో కొనసాగింది. ర్యాలీలో ఓటు యొక్క ప్రాముఖ్యత తెలుపుతూ ప్లకార్డులతో నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో సీనియర్ ఓటర్లను 7వ అదనపు జిల్లా సెషన్స్ (ఫాస్ట్ ట్రాక్ కోర్టు) జడ్జి జి.చంద్రమౌళీశ్వరి, ఆర్డీఓ కె.శ్రీరమణి, తహశీల్దార్ సిహెచ్.వెంకట లక్ష్మీలు సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఆర్డీఓ కె.శ్రీరమణి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం లాంటిదని, ఓటుతో ఏర్పడే ప్రభుత్వాలు ప్రజల జీవితలను, తమం భవిష్యత్ను ప్రభావితం చేస్తాయని కావున అర్హత కలిగిన ప్రతీ ఒక్కరూ ఓటుహక్కు పొందాలని సూచించారు. నూతన ఓటర్లకు ఓటర్ గుర్తింపు కార్డులను పంపిణి చేశారు. అత్యుత్తమ సేవలు అందించిన బిఎల్ఓలకు ప్రశంస పత్రాలు అందజేశారు. దీనిలో భాగంగా జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట తహశీల్దార్ చంద్రశేఖరరెడ్డి, ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు, డిటిలు భానుకుమార్, పద్మావతి, లక్ష్మీకుమారి, నియోజవర్గంలోని బిఎల్ఓలు, పెద్దాపురం నియోజకవర్గంలోని పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# వాకర్స్ హెల్త్ క్లబ్ జిల్లా 103 గవర్నర్‌గా తోలేటి



జగ్గంపేట, మేజర్ న్యూస్ : స్థానిక కాపు సామాజిక భవనంలో వాకర్స్ హెల్త్ క్లబ్ జగ్గంపేట చాప్టర్ 152 ఏరియా 1 ఆధ్వర్యంలో జిల్లా 103 వాకర్స్ గవర్నర్‌గా జగ్గంపేట పెన్షనర్ సంఘం అధ్యక్షులు, తోలేటి సూర్య నారాయణ ప్రమాణ స్వీకార మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.రవిరాజు గవర్నర్ తోలేటి సూర్యనారాయణ తోను, క్యాబినెట్ మెంబర్స్‌తోను ప్రమాణస్వీకారం చేయించారు. మరో ముఖ్యఅతిథిగా హాజరైన కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ప్రమాణ స్వీకారం చేసిన తోలేటి సూర్యనారాయణను క్యాబినెట్ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రవిరాజు మాట్లాడుతూ ప్రపంచంలో వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ 1650 క్లబ్ లతో 5లక్షల మంది సభ్యులతో ఆరోగ్యమే మహాభాగ్యం, నడు నడిపించు అనే నినాదంతో పనిచేస్తుందని, ప్రతి ఒక్కరూ నడవాలని నడక ఆరోగ్యానికి మంచిదని వాకర్స్ క్లబ్ స్థాపించడం జరిగిందన్నారు. అనేక ఆరోగ్య శిబిరాలతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థ కార్యక్రమాలు కూడా చేస్తున్నామని, వాకర్స్ క్లబ్ లో సభ్యులందరికీ హెల్త్ కం ఐడి కార్డులు కూడా పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు.

గవర్నర్ తోలేటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో జగ్గంపేటకు వాకర్స్ క్లబ్ కోసం స్థలం ఇమ్మని కోరుతూ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కు వినతిపత్రం అందజేయగా ఆయన వెంటనే స్పందించి జగ్గంపేట కోనేటి వద్ద వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్న పార్కు వద్దనే స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. తోలేటి సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రమాణ స్వీకారోత్సవానికి విచ్చే సిన అతిరథ మహారథులందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని చెప్పారు. మా వాకర్స్ క్లబ్ ద్వారా ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తామని మీరంతా ఆరోగ్యం కాపాడుకోవాలంటే వాకర్స్ క్లబ్‌లో చేరాలని పిలు పినిచ్చిరి. జ్యోతుల నవీన్ మాట్లాడుతూ ప్రతినిత్యం ఏదో ఒక సేవా కార్యక్రమం తో ముందుండే మీరందరూ వాకర్స్ క్లబ్‌లో ఉండడం ఎంతో సంతోషంగా ఉందని వాకర్స్ క్లబ్ వారు చేస్తున్న సేవలు వెలకట్టలేవని తెలుగు నేల విశాఖపట్నంలో స్థాపించిన ఈ వాకర్స్ క్లబ్ ప్రపంచవ్యాప్తంగా క్లబ్బులు ఏర్పడడం తెలుగు వారందరూ గర్వించదగ్గ విషయం అని మీకు ఏ అవసరం వచ్చినా ముందుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి ఎస్ శర్మ, కోడూరి రంగారావు, రావి కృష్ణారావు, పి గోవింద గుప్తా, ఎం భాస్కరరావు, కోనేటి రవిరాజు, ముని కృష్ణ యాదవ్, డాక్టర్ నాగేంద్ర , తాతారావు , మల్లేశ్వరరావు, వెత్సానాగ సత్య ,పూర్రే సూరన్న ,ఇళ్ళబుద్దాజీ.డి సత్యనారాయణ మూర్తి ,సమ్మెట సాయిరాం , జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, కొత్త కొండబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, రాయి సాయి పొట్టి రాజేష్ ,మానేపల్లి సతీష్ కొత్త నాగ పండు తదితరులు పాల్గొన్నారు.

# రిపబ్లిక్ డే అవార్డు పొందిన సలాది ఉదయభాస్కరరావు



పెరవలి, మేజర్ న్యూస్ : ముక్కామల గ్రామానికి చెందిన సలాది ఉదయభాస్కరరావు 77 వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రభుత్వం వారు అందించే ఉత్తమ సోషల్ యాక్టివిస్ట్ అవార్డు పొందారని పెరవలి తాసిల్దార్ కే నిరంజన్ మేజర్ న్యూస్‌కు తెలియజేశారు. జనవరి 26వ తేదీ సోమవారం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగే తూర్పుగోదావరిజిల్లా స్థాయి 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో తూర్పుగోదావరి జిల్లా ఇంచార్జి కలెక్టర్ వై మేఘా స్వరూప్ ఈ అవార్డు అందిస్తారని ఆయన అన్నారు. పెరవలి మండలం లయన్స్ క్లబ్ సెక్రెటరీగా, వశిష్ట వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా పేదలకు ఆసరాగా నిలుస్తున్నారని అందువలన ఎన్జీవో ఆర్గనైజేషన్కు ఇచ్చే ఉత్తమ సోషల్ యాక్టివిస్ట్ అవార్డును సలాది ఉదయభాస్కర రావుకు వచ్చిందని పెరవలి తాసిల్దార్ కే నిరంజన్ అన్నారు.

ఈ సందర్భంగా తనకు ఈ అవార్డు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన సలాది ఉదయభాస్కరరావు తాను 16 సంవత్సరాల క్రితం నా మార్గదర్శి పెరవలి మండలం లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు వంక రవీంద్రనాథ్ గారి చొరవతో పెరవలి మండలం లయన్స్ క్లబ్ లో జాయిన్ అయి ప్రెసిడెంట్గా, ట్రెజరర్‌గా, సెక్రెటరీగా వివిధ పదవులు నిర్వహిస్తూ పేదలకు సహాయ సహకారాలు అందిస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నానని అదేవిధంగా పెరవలి మండలం వశిష్ట వినియోగదారుల సంఘం తరపున అనేక కార్యక్రమాలు చేస్తున్నానని వాటికి గుర్తింపు ఈ అవార్డు ద్వారా వచ్చిందని తన సేవలను గుర్తించి నివేదికలు పంపిన పెరవలి తాసిల్దార్ కే నిరంజన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియజే శారు. టాన్ చేసేసావే కార్యక్రమాల్లో తనకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఉండ్రాజవరంలో వైభవంగా మైత్రేయ బుద్ధ విహార్ కలశ ప్రతిష్ఠ మహోత్సవం

**– ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి కందుల దుర్గేష్, స్కిల్ డెవలప్ మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు**

నిడదవోలు, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్‌లోని చారిత్రాత్మక బౌద్ధ క్షేత్రాలను అనుసంధానం చేస్తూ అంతర్జాతీయ స్థాయి 'బుద్దిస్ట్ సర్క్యూట్'లుగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం ఉండ్రాజవరం మండలంలో నిర్మించిన మైత్రేయ బుద్ధ విహార్ కలశ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, స్కిల్ డెవలప్?మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు ముఖ్య అతిథులుగా హాజరై బుద్ధుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు తణుకు నుండి ఉండ్రాజవరం వరకు బౌద్ధ భిక్షువులతో కలిసి శాంతి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ గత 11 ఏళ్లుగా బౌద్ధ భిక్షువు ఆనాలయ నేతృత్వంలో బౌద్ధ ధర్మపీఠం చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఒక ఎకరం విస్తీర్ణంలో నిర్మించిన ఈ విహార్ ద్వారా చిన్నారులకు విద్య, వైద్యం, యోగా, ధ్యానం, వక్తృత్వం, కరాటే, చిత్రలేఖనంలో ఉచిత శిక్షణ అందించడం గొప్ప విషయమని కొనియాడారు. కేవలం మతపరమైన కేంద్రంగానే కాకుండా, రాజ్యాంగ పరిరక్షణకు, శాంతి మార్గానికి ఈ విహార్ వేదిక కావడం సంతో షకరమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, నాగార్జునకొండ, బొజ్జన్నకొండ, తోట్లకొండ వంటి చారిత్రాత్మక బౌద్ధ ప్రాంతాలను కలిపి బుద్దిస్ట్ సర్క్యూట్‌గా తీర్చిదిద్ది కేంద్ర ప్రభుత్వ సహకారంతో పర్యాటక



రంగంలో అగ్రగామిగా నిలుపుతామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. గతంలో వియత్నాంలో జరిగిన బుద్ధ భగవానుని పవిత్ర అస్థికల ప్రదర్శన బాధ్యతను పీఎంవో తనకు అప్పగించడాన్ని తన జీవితంలో దక్కిన అరుదైన గౌరవంగా గుర్తుచేసుకున్నారు.రాష్ట్రంలో శాతవాహనుల కాలం నాటి బౌద్ధ ఆరామాలు, స్థూపాలు మరియు విగ్రహాలను సంరక్షిస్తూ, భావితరాలకు బౌద్ధ వారసత్వాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన బౌద్ధ భిక్షువులు, ఉపాసకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు అన్నదానం

**– పాల్గొన్న భక్తులు**



పెద్దాపురం,మేజర్ న్యూస్ : పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, అన్నప్రసాదం స్వీకరించారు. వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకట రమణ, క్రాంతివీర్, గౌరి, వరహాలు, లోవ, శివ పాల్గొన్నారు.

## భీమేశ్వరాలయంలో రథసప్తమి వేడుకలు



సామర్లకోట, మేజర్ న్యూస్ : పంచారామ క్షేత్రం సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వరాలయంలో రథసప్తమి వేడుకలు, శ్రీ సూర్యనారాయణ స్వామి దివ్య కళ్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో బల్ల నీలకంఠం, ధర్మకర్తల మండలి ఛైర్మన్ కంటే జగదీష్ మోహన్ పర్యవేక్షణలో తెల్లవారు జామున నుండి ఆలయ అర్చకులు స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. వాసంశెట్టి రఘు కుమార్ దంపతులు యజ్ఞకర్తలుగా కళ్యాణ కతువును జరిపించారు. రథసప్తమి సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోగా, భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

## పిఠాపురంలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



పిఠాపురం, మేజర్ న్యూస్ : పిఠాపురం పట్టణం స్థానిక పంచవటి లాడ్జి నందు గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు పిఠాపురం పట్టణ ఎస్సై వి.మణి కుమార్ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. 25 వ తేదీన ఉదయం 6 గంటలకు సుమారు 30 నుండి 35 సంవత్సరాల వయస్సు కలిగిన అసామి పంచవటి లాడ్జి నందు రూమ్‌లో... బెడ్ షీట్‌తో ఫ్యాన్‌కి ఉరి వేసుకుని చనిపోయి వేలాడుతూ కనిపించాడని, అతను సుమారుగా ఐదు అడుగుల మూడు అంగుళాలు ఎత్తు కలిగి, చామన చాయ కలిగి, కోలా ముఖం కలిగి ఉన్నాడని, నలుపు రంగు చొక్కాపై తెలుపు డిజైన్ కలిగి మరియు లైట్ సిమెంట్ రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. కావున సదరు ఫోటోలోని మృతుడిని ఎవరైనా గుర్తించిన ఎడల కాకినాడ జిల్లా, పిఠాపురం పట్టణ పోలీస్ స్టేషన్ పిఠాపురం పట్టణ ఎస్ఐ ఫోన్ నెంబర్ 9440796560, పిఠాపురం సర్కిల్ సిఐ 9440796523 నెంబర్లకు సమాచారం అందించవలసిందిగా కోరుతున్నామన్నారు.

# 77వ గణతంత్ర దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాల ఏర్పాట్లను జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామ మూర్తి, రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్. కృష్ణ నాయక్, కె.ఆర్.ఆర్.సి ఎస్డిసి ప్రతినిధి కె. భాస్కర్ రెడ్డిలు ఆదివారం సాయంత్రం సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి టి సీతారామ మూర్తి మాట్లాడుతూ, గణతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశామన్నారు. ఈ గణతంత్ర దినోత్సవ వేడుకలలో ప్రత్యేక ఆకర్షణగా పెరేడ్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పోలీస్, హోంగార్డ్స్, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్ఎస్, స్కౌట్స్ అండ్ గైడ్స్, విద్యార్థి విభాగాల సమన్వయంతో నిర్వహించే ఈ పెరేడ్‌లో క్రమశిక్షణ, జాతీయ భావం ప్రతిబింబించే విధంగా విన్యాసాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. పెరేడ్ రిహార్సల్స్‌ను పకడ్బందీగా నిర్వహించి, గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రత్యేక శోభ తీసుకు రానున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేసే విధంగా శకటాల ప్రదర్శనను ఆకర్షణీయంగా నిర్వహించాలని ఆదేశించారు. ఇందుకోసం అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యక్రమాలను ప్రతిబింబించే శకటాలు మరియు స్టాల్స్ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా డి.ఆర్.డి.ఏ, సెర్ప్ & మెప్మా, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్, వ్యవసాయం మరియు హార్టికల్చర్ శాఖలు, స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలు, డీపీఓ & ఎస్.ఈ ఆర్.డబ్ల్యూ.ఎస్, పాఠశాల విద్య మరియు సమగ్ర శిక్ష (రూూా), పౌర సరఫరాలు, వైద్య ఆరోగ్య శాఖ, పశు సంవర్ధక శాఖ, విద్యుత్ సంస్థ తదితర శాఖలు శకటాల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా భద్రత, పారిశుధ్యం, త్రాగునీరు, విద్యుత్, రాకపోకల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు పూర్తి

**భీమవరం,మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టరేట్ పెరేడ్ గ్రౌండ్ లో జనవరి 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు పూర్తి అయినవని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఏర్పాట్లలో భాగంగా మూడు పెద్ద డయాస్ లు, రెండు చిన్న డయాస్ లు, ఒక గ్యాలరీ, స్టాల్స్, వివిధ శాఖలకు సంబంధించిన శకటాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వేడుకల నిర్వహణ సందర్భంగా ప్రభుత్వ పథకాలు ప్రతిబింబించేలా శకటాలు, స్టాల్స్ ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. గణతంత్ర దినోత్సవం వేడుకల్లో ప్రోటోకాల్ ను అనుసరించి సీటింగు ఏర్పాట్లను, స్టేజీ ఏర్పాట్లు, త్రాగునీటి సరఫరా, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టం, తదితర పటిష్ట ఏర్పాట్లు చేయడం జరిగింది అన్నారు. విద్యుత్తు సరఫరాలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని, ప్రత్యామ్నాయంగా జనరేటరు కూడా ఏర్పాటు చెయ్యాలని విద్యుత్తు శాఖ అధికారులను ఆదేశించామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం,ఓఅర్ యస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు, అంబులెన్స్ సేవలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. అధికారులందరూ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేలా సమన్వయంతో పని చేయాలని కోరారు. వేడుకలలో భాగంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను ప్రేక్షకులు వీక్షించేలా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

# రథసప్తమి పర్వదినం...
# అన్నవరం స్వామివారి చెంత ఎస్పీ దంపతులు





**అన్నవరం, మేజర్ న్యూస్ :** సకల లోక బాంధవుడు, ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడి జన్మదినమైన రథసప్తమి వేడుకలను పురస్కరించుకొని, కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఐపీఎస్ ఆదివారం రత్నగిరిపై వేంచేసి ఉన్న శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు. తన ధర్మపత్నితో కలిసి విచ్చేసిన ఎస్పీ గారికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ఘన మర్యాదలు గావించారు.

**ఆధ్యాత్మిక వాతావరణంలో దర్శనం...** తిరుమల తర్వాత అంతటి ప్రాశస్త్యం కలిగిన అన్నవరం క్షేత్రంలో రథసప్తమి నాడు స్వామివారిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని ఎస్పీ పేర్కొన్నారు. దంపతులు ఇద్దరూ స్వామివారి మూలవిరాట్టును దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మంటపంలో వేద పండితులు వారికి వేదాశీర్వచనం అందజేసి, తీర్థప్రసాదాలు, స్వామివారి శేషవస్త్రాన్ని బహూకరించారు.

నేపథ్యం – పర్యవేక్షణ...ఈ పర్యటన ఆద్యంతం అత్యంత క్రమశిక్షణతో, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా సాగింది.డిసి బాబురావు, పి.ఆర్.ఓ గణపతి లు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ సూపరింటెండెంట్లు మరియు ఇతర సిబ్బంది ఎస్పీ దంపతుల పర్యటనలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా సమన్వయం చేశారు.దర్శనం అనంతరం ఎస్పీ బిందు మాధవ్ మీడియాతో మాట్లాడుతూ.. జిల్లా ప్రజలందరికీ రథసప్తమి శుభాకాంక్షలు తెలిపారు. "సూర్య భగవానుడి అనుగ్రహంతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యంతో తులతూగాలని కోరుకున్నాను. శాంతి భద్రతల పరిరక్షణలో దైవబలం తోడవ్వాలని, ప్రజలందరికీ మేలు జరగాలని స్వామివారిని ప్రార్థించాను," అని బిందుమాధవి ఐపీఎస్ పేర్కొన్నారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీని, భద్రతా ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## ఓటుతో మార్పు సాధ్యం.....
## ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం....



**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** ప్రజాస్వామ్య భారతదేశంలో ఓటు హక్కుతో ఎటువంటి మార్పునైనా సాధించే వీలుందని అటువంటి ఓటు హక్కును 18 సంవత్సరాల నుండి ఉన్న ప్రతి యువత నమోదు చేసుకోవాలని అడ్డతీగల ఎంపీడీవో ఏవివి కుమార్ తాసిల్దార్ దొరకయ్య అన్నారు. ఆదివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటు యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిలో చైతన్యం నింపడం ఓటు హక్కునమోదు చేయించేలా చేయించడమే దీని ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ గాదే గరియమ్మ కలగంటి నారాయణమ్మలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సమర్థ కృష్ణ జగ్గారావు, రెవెన్యూ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఎలక్షన్ సూపర్వైజర్‌గా తానంకి వెంకటేశ్వరరావు



**పెరవలి, మేజర్ న్యూస్ :** జాతీయ ఓటర్ల దినోత్సవం 2026 ను పురస్కరించుకుని జిల్లా స్థాయిలో ఉత్తమ ఎలక్షన్ సూపర్వైజర్‌గా పెరవలి ఏఎస్ఓగా పనిచేస్తున్న తానంకి వెంకటేశ్వరరావు ఎంపికయ్యారు.

ఈ మేరకు జనవరి 25వ తేదీ ఆదివారం పెరవలి మండల సహాయగణాంక అధికారి ఏఎస్ఓ తానంకి వెంకటేశ్వరరావు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ (ఇంచార్జ్) మేఘా స్వరూప్ చేతులమీదుగా అవార్డు స్వీకరించడం జరిగింది.

## సీనియర్ ఓటర్లకు సన్మానం



**పెరవలి, మేజర్ న్యూస్ :** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జనవరి 25వ తేదీ ఆదివారం కానూరు అగ్రహారం గ్రామంలో గ్రామ సీనియర్ ఓటరు పెద్దలను సాలువాతో సత్కరించి గ్రామ కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది ప్రజలు పండ్లు పంపిణీ చేశారు.

# రిపబ్లిక్ డే శుభాకాంక్షలతో....

**COURSES OFFERED**

**B-TECH**
- CIVIL
- CSE
- CSE( AI & ML )
- CSE( DS )
- EEE
- ECE
- MECH

**M-TECH**
- ECE( ES & VLSI )
- ME( CAD / CAM )
- CSE
- CIVIL( Structural Engineering )

KITS
ENGINEERING COLLEGE
DIVILI

డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపక బృందం
దివిలి-తిరుపతి, పెద్దాపురం మండలం



బెతినీడి శ్రీనివాసరావు
ఛైర్మన్,
కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల



# రిపబ్లిక్ డే శుభాకాంక్షలతో....



కె.విజయలక్ష్మి
అసిస్టెంట్ కమిషనర్
మరియు సిబ్బంది, పెద్దాపురం

చింతపల్లి శ్రీహర్ష
వంశపారంపర్య ఛైర్మన్
శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం



శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారు



## ప్రజా ప్రతినిధులకు, ఉన్నతాధికారులకు రిపబ్లిక్ డే శుభాకాంక్షలతో...



కె.వి.సూర్యనారాయణ
ఎంపిడివో



జి.వి.శేఖర్ రెడ్డి
డిప్యూటీ ఎంపిడివో



వి.శ్రీహరి
మండల స్వర్ణ గ్రామాధికారి



ఎం.సత్యనారాయణమూర్తి
మండల పరిషత్ పరిపాలనాధికారి

| | | | | | |
|---|---|---|---|---|---|
| బి.బి.వి.రమణ పంచాయితీ సెక్రటరీ ఆనూరు | ఎన్.వి.వి.ఎస్.ఎన్.మూర్తి పంచాయితీ సెక్రటరీ, దివిలి | డి.సూర్యనారాయణ రెడ్డి పంచాయితీ సెక్రటరీ, జి.రాగంపేట | ఎం.శ్రీనివాసరావు పంచాయితీ సెక్రటరీ, కట్టమూరు | ఎ.ఎస్.ఆర్.ఫణికుమార్ పంచాయితీ సెక్రటరీ, ఆర్.బి.పట్నం | ఎం.డి.ఎం.కె.షావలి పంచాయితీ సెక్రటరీ, చంద్రమాంపల్లి |
| ఎం.డి.బషీరుద్దీన్ పంచాయితీ సెక్రటరీ, కాండ్రకోట | వి.శ్రీనివాసరావు పంచాయితీ సెక్రటరీ, పులిమేరు | ఎన్.కాత్యాయని పంచాయితీ సెక్రటరీ, సి.బి.దేవం | కె.దత్తు పంచాయితీ సెక్రటరీ, చదలాడ | బి.ఈశ్వరరావు పంచాయితీ సెక్రటరీ, గోరింట | ఎండి జిలానిఖాన్ పంచాయితీ సెక్రటరీ, జె.తిమ్మాపురం |
| లంక హేమశ్రీ పంచాయితీ సెక్రటరీ, మర్లావ | వి.శ్రీనివాసరావు ఐ.సి. పంచాయితీ సెక్రటరీ, తిరుపతి | జి.రమ్యశృతి పంచాయితీ సెక్రటరీ, ఉలిమేశ్వరం | వి.వి.బి.ఎస్.సి. కళావతి పంచాయితీ సెక్రటరీ, వడ్లమూరు | డి.అన్నపూర్ణ పంచాయితీ సెక్రటరీ, సిరివాడ | ఎ.ఎస్.ఆర్.ఫణికుమార్ పంచాయితీ సెక్రటరీ, ఆర్.బి.కొత్తూరు |

మండల ప్రజాపరిషత్ కార్యాలయం, పెద్దాపురం



# రిపబ్లిక్ డే శుభాకాంక్షలతో...

Bharatgas
Cook Food. Serve Love.

మండవిల్లి శ్రీనివాస ముత్యాలు
భారత్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్
కుమ్మరి వీధి, పెద్దాపురం

जी हाँ!
HP GAS
your friendly gas

వై.ఎస్.వి.రమణ
హెచ్‌పి గ్యాస్ డిస్ట్రిబ్యూటర్
మెయిన్ రోడ్, మరిడమ్మ గుడి వీధి, పెద్దాపురం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం,
పెద్దాపురం
సబ్ రిజిస్ట్రార్
మరియు
కార్యాలయ సిబ్బంది



తోట భార్గవరామ్,
పెద్దాపురం ఎన్‌జివో అసోసియేషన్ అధ్యక్షులు

రేలంగి వెంకటరావు,
పెద్దాపురం
వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్



# ఘనంగా 37వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు



**- సురక్షిత ప్రయాణం.. అందరి బాధ్యత: ఎంపీ సానా సతీష్ బాబు**

**- పోలీస్ శాఖకు రూ.2 లక్షల విలువైన బ్రీత్ అనలైజర్ వితరణ**

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** రహదారి నిబంధనల పట్ల అవగాహన, క్రమశిక్షణతో కూడిన ప్రయాణమే ప్రాణాలకు రక్ష అని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు అన్నారు. కాకినాడలో రవాణా శాఖ ఆధ్వర్యంలో 'భద్రత - సాంకేతికత - పరివర్తన' అనే నినాదంతో నిర్వహించిన 37వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు అత్యంత ఘనంగా జరిగాయి.

**కీలక నిర్ణయాలు - ప్రోత్సాహకాలు**

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ సతీష్ బాబు తన సానా సతీష్ ఫౌండేషన్ తరపున సుమారు రూ.2 లక్షల విలువైన బ్రీత్ అనలైజర్‌ను డీటీసీ శ్రీధర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ఎన్డీఏ ప్రభుత్వాలు రహదారి భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాయని తెలిపారు. ప్రమాదాల నివారణకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఆయన వివరించారు:

- ఉచిత వైద్యం: ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం.- ఆర్థిక సహాయం: ప్రత్యేక పథకం ద్వారా బాధితులకు రూ.2 లక్షల ఆర్థిక సాయం.
- గుడ్ సమారిటన్ రివార్డ్: ప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడిన వారికి రూ.25 వేల నగదు ప్రోత్సాహకం.

డ్రైవర్లకు హెచ్చరిక.. సామాజిక బాధ్యతకు ప్రశంస

మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై, నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, అవసరమైతే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.అదేసమయంలో, గర్భిణీ స్త్రీలు, వికలాంగులకు ఉచితంగా సేవలు అందిస్తున్న ఆటో డ్రైవర్లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఆటోల వెనుక సామాజిక సందేశాలు రాసి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న వారి తీరు ప్రశంసనీయమని కొనియాడారు.

**ఎంపీ చిన్ననాటి జ్ఞాపకాలు..**

"నేను ఆరో తరగతి చదువుతున్నప్పుడే సామాజిక బాధ్యతగా ఒకరోజు ట్రాఫిక్ నియంత్రణ విధులు నిర్వహించాను. అప్పుడే ట్రాఫిక్ కానిస్టేబుళ్లు పడే కష్టం, నిబంధనల విలువ నాకు తెలిసింది" అని ఎంపీ తన పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

**గౌరవ అతిథుల పిలుపు**

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఎమ్మెల్సీ కర్రీ పద్మశ్రీ, ఆర్టీసీ ఆర్?ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. సాంకేతికతను జోడించి ప్రమాద రహిత జిల్లాగా కాకినాడను తీర్చిదిద్దాలని, ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నియమాలను స్వచ్ఛందంగా పాటించాలని వారు కోరారు. ఈ అవగాహన సదస్సులో పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు, స్కూల్ బస్ డ్రైవర్లు పాల్గొన్నారు.

# 'ఆదిత్య'లో జాతీయ టూరిజమ్ దినోత్సవం





**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక సాంబమూర్తినగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ & పి.జి కళాశాల (అటానమస్) జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జనవరి 25వ తేదీన జాతీయ టూరిజమ్ దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. కరుణ తెలిపారు.ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి. ఎల్. నాయుడు మాట్లాడుతూ దేశం ఆర్థికంగా బలపడటానికి టూరిజమ్ అనేది ఒక్కవనరుగా పనిచేస్తుంది అని అన్నారు. చైనా, సింగపూర్, థాయి లాండ్, వంది దేశాలు ఆర్థికంగా బలపడటానికి టూరిజమ్ ఒక కారణం అన్నారు. టూరిజమ్ పై విద్యార్థినీలలో అవగాహన అవసరం అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ, అంతర్జాతీయంగా అన్ని దేశాలు టూరిజమ్ మీద శ్రద్ధ పెడుతున్నాయి అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టూరిజమ్‌కు అత్యంత ప్రాధాన్యత యిస్తున్నారని, మన ఆంధ్రప్రదేశ్‌కు తీరరేఖ ఎక్కువగా ఉండడం వల్ల, టూరిజమ్ డెవలప్ చేయడానికి చాలా అవకాశాలు ఉన్నాయి అన్నారు.

కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నాగ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థినీలకు అవగాహన కార్యక్రమంలో భాగంగా చిత్రలే ఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు ఎన్.ఎస్.ఎస్ యూనిట్-1 ఆధ్వర్య ంలో నిర్వహించామన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. ప్రొగ్రాం ఆఫీసర్ యమ్. శ్రీనివాస్, ఆసిస్టెంట్ ప్రొగ్రాం ఆఫీసర్ కె.నవ్య, మరియు ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.

# దేశ పురోగతిలో వైశ్యులదే కీలక పాత్ర

**- ఎమ్మెల్యే వరుపుల**




**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** దేశ పురోభివృద్ధిలో ఆర్యవైశ్యులదే కీలకపాత్రని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపులు సత్య ప్రభ రాజా అన్నారు. ఆదివారం ఏలేశ్వరం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వేదికపై ఎమ్మెల్యే వరుపుల మాట్లాడుతూ స్వతంత్ర ఉద్యమంలో గాంధీ కీలకపాత్ర వహించారని, ఆంధ్ర రాష్ట్ర అవతరణలో పొట్టి శ్రీరాములు ఇలా ఎంతోమంది తమ జీవితాలను త్యాగం చేసిన వారిలో ఆర్యవైశ్యులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిన్న రామ సత్యనారాయణ, కాకినాడ జిల్లా అధ్యక్షులు పులవర్తి కుమార్, ఉభయ గోదావరి జిల్లాల ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు గొల్లపూడి త్రిమూర్తులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా ఎంపికైన వాగు రాజేష్ సేవలను ప్రశంసించారు. అలాగే స్థానికంగా అసంపూర్ణంగా ఉన్న ఆర్యవైశ్య కళ్యాణ మండపాన్ని పునర్ నిర్మించేందుకు ప్రభుత్వ పరంగా సహాయం అందించాలని ఎమ్మెల్యేని కోరారు. కాగా ఆమె దీనిపై స్పందిస్తూ శ్రీ వాణి ట్రస్ట్ ద్వారా వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా రాతికింద సతీష్, కోశాధికారిగా పులవర్తి శ్రీనివాస్ లు ఎంపికయ్యారు వీరిని రాష్ట్ర అధ్యక్షులు ప్రమాణ స్వీకారం చేయించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ అలమండ సత్యవతి చలమయ్య, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపాలకృష్ణ, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు జ్యోతుల పెదబాబు, టౌన్ అధ్యక్షులు మూది నారాయణస్వామి, మండల ఉపాధ్యక్షులు చిక్కాల లక్ష్మణరావు రాజ్యలక్ష్మి ఆర్యవైశ్య పెద్దలు ఊర కృష్ణ, వాగు గున్నం రాజు, దేవకి రాంబాబు, పూర నానాజీ, అనంతపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలి గ్రామ పంచాయతీ వద్ద జనవరి 25వ తేదీ ఆదివారం ఓటర్ల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా విచ్చేసిన పెరవలి మండల జనసేన అధ్యక్షులు పిప్పర రవి మాట్లాడుతూ మన దేశంలో ఓటు అనేది అత్యంత శక్తివంతమైనదని అన్నారు. అనేక రాజకీయ పార్టీలను ప్రజలు వారి మద్దతుతో వారి యొక్క విలువైన ఓటుతో ప్రభుత్వంలో కూర్చోపెట్టారని, వారి పరిపాలన నచ్చకపోతే అదే ఓటు అనే ఆయుధం ఉపయోగించి ప్రతిపక్షం కూడా లేకుండా చేశారని అన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్న కూటమి ప్రభుత్వానికి ధన్యవాదములు తెలిపారు. తదుపరి గ్రామ సీనియర్ ఓటర్లు దాసరి రామకృష్ణ, ముదునూరి సుబ్బ రాజులను గ్రామ ప్రజల సమక్షంలో సత్కరించారు. ఈ కార్యక్ర మంలో సర్పంచ్ గంగోలు సీతమ్మాజోసెఫ్, ఎంపీటీసీ రాపాక ప్రమీల,కూటమి నాయకులు సలాది కృష్ణమూర్తి, మానికిరెడ్డి మురళీకృష్ణ, వీరవల్లి శ్రీను, మారిశెట్టి రాంబాబు,నాగిరెడ్డి నాగేశ్వరావు, పంపన మావుళ్ళు, వీఆర్వో సొంగ రాజు,సెక్రటరీ డి కనకదుర్గ, బిఎల్ఓ లు సంజయ్, అరుణకుమారి, కుమార్, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కానూరులో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



**పెరవలి, మేజర్ న్యూస్ :** జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జనవరి 25వ తేదీ ఆదివారం కానూరు గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బావన మధు పూర్ణచందు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని ముఖ్యంగా సీనియర్ ఓటర్లు తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమిచ్చారని అన్నారు. ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో కె.రాజశేఖర్, 5వ వార్డ్ మెంబర్ బూరుగుపల్లి రాజు, బిఎల్వోలు పాల్గొని సీనియర్ ఓటర్లను శాలువాలతో సత్కరించి వారి సేవలను అభినందించారు. ఓటరు అవగాహన కార్యక్రమాలు గ్రామస్థాయిలో మరింత విస్తృతంగా నిర్వహించాలని వారు సూచించారు.

## విజయవంతంగా రాష్ట్ర స్థాయి భీమేశ్వర ఎడ్ల పరుగు ప్రదర్శన



**సామార్లకోట, మేజర్ న్యూస్ :** యార్లగడ్డ వెంకట సుబ్బారావు మెమోరియల్ శ్రీ కుమార రామ భీమేశ్వర రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన సామర్లకోట ఉండూరు ఎన్.ఎఫ్.సి. ఎల్ రోడ్డులో కోలాహలంగా సాగుతున్నాయి. ఎడ్ల పరుగు ప్రద ర్శన పోటీలను కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు నిమ్మకా యల రంగనాగ్ ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 45 ఎడ్ల జతలు సీనియర్స్, జూనియర్స్ విభాగంలో పోటీలు జరుగుతున్నట్లు కంటే జగదీష్ మోహన్, తెలుగు యువత అధ్యక్షులు వల్లూరి దొరబాబులు తెలిపారు. ఉదయం నుండి సాగుతున్న పోటీలను తిలకించేందుకు పెద్దఎత్తున ప్రజలు హాజరు కావడంతో సందడి వాతావరణం ఏర్పడింది. పోటీలు ముగింపు అనంతరం విజేతలకు ఎమ్మెల్యే చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబులు బహుమతి ప్రధానం చేయనున్నట్లు తెలిపారు.